RNI NO.TELTEL/2022/83842

# ప్రభాత గమనం
PRABHATA GAMANAM
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ ‖ సంచిక 236 ‖ సంపుటి 4 ‖ శనివారం ‖ 16-05-2026 ‖ పేజీలు 4 ‖ వెల 3/-

# 26న 'నైరుతి' రాక..

- కేరళను తాకనున్న రుతుపవనాలు
- ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు చల్లని కబురు
- మే 22 నుంచి 30 మధ్య రుతుపవనాల ప్రవేశం?
- వాతావరణ పరిస్థితులపై ఐఎండీ స్పష్టీకరణ
- ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం



దేశవ్యాప్తంగా భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతున్న వేళ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు అందించింది. నైరుతి రుతుపవనాలు ఈ నెల 26న కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని ప్రకటించడంతో రైతాంగంలో ఆశలు చిగురించాయి. వాతావరణ పరిస్థితులను బట్టి మే 22 నుంచి 30 మధ్య ఎప్పుడైనా రుతుపవనాలు కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. రుతుపవనాల రాకతో దేశంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభించే అవకాశముండగా, ఖరీఫ్ సాగు పనులకు రైతులు సిద్ధమవుతున్నారు. అయితే ఈ ఏడాది 'ఎల్ నినో' ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించడం ఆందోళన కలిగిస్తోంది.

— ప్రభాత గమనం, హైదరాబాద్

2




2

# బ్యాటరీ దొంగల అరెస్ట్

- స్వయంచాలిత వాహనాల బ్యాటరీలు చోరీ చేస్తున్న నిందితులు
- సంగెం పోలీసుల చాకచక్యంతో పట్టివేత
- వరుస చోరీలకు చెక్ పెట్టిన పోలీసులు
- ఆరు బ్యాటరీలు, స్కూటీ స్వాధీనం
- నిఘా వేసి నిందితులను పట్టుకున్న ప్రత్యేక బృందం
- పలుచోట్ల బ్యాటరీలు దొంగిలించిన నిందితులు
- వరంగల్ లో అమ్మేందుకు తరలిస్తుండగా అరెస్ట్
- విచారణలో నేరాలు ఒప్పుకున్న ఇద్దరు
- వేగంగా కేసు ఛేదించిన సంగెం పోలీసులు
- పోలీసుల పనితీరుపై ప్రజల ప్రశంసలు
- సీపీ రాజగోపాల్ అభినందనలు

## పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీలో ఎంపీ కావ్య

- తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం
- హర్షం వ్యక్తం చేసిన జిల్లా ప్రజానీకం



3

## జూన్ 8 నుంచి చేప ప్రసాదం

- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో పంపిణీ
- తేదీలు ప్రకటించిన బత్తిని కుటుంబం

ప్రభాత గమనం, హైదరాబాద్ :

మృగశిర కార్తె సందర్భంగా ఆస్తమా బాధితులకు బత్తిని కుటుంబీకులు అందించే ప్రసిద్ధ చేప ప్రసాదం జూన్ 8న రాత్రి 9 గంటల నుంచి హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ప్రారంభం కానుంది. ఈ మేరకు నిర్వాహకులు బత్తిని గౌరీ శంకర్ గౌడ్, బత్తిని అమర్నాథ్ గౌడ్ వెల్లడించారు. సుమారు 180 ఏళ్లుగా తమ కుటుంబం ఆస్తమా బాధితులకు ఉచితంగా చేప ప్రసాదం అందిస్తోందని బత్తిని కుటుంబ సభ్యులు తెలిపారు. జూన్ 8న రాత్రి ప్రారంభమయ్యే పంపిణీ కార్యక్రమం జూన్ 9 రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగుతుందని చెప్పారు. ప్రసాదం అందని వారికి కవాడిగూడలోని తమ నివాసం వద్ద మరో మూడు నుంచి నాలుగు రోజుల పాటు పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. వారి కోసం తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో భోజనం, మంచినీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా బత్తిని కుటుంబ సభ్యులను అగర్వాల్ సమాజ్ ప్రతినిధులు సన్మానించారు.

## ధాన్యం తరలింపులో జాప్యం వద్దు

- మిల్లర్లకు అధికారుల స్పష్టమైన ఆదేశాలు
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- రైస్ మిల్లర్లతో తహసీల్దార్ల సమావేశం
- నాణ్యత లోపాలపై కఠిన చర్యలు
- డ్రైవర్లు మిల్లు వద్దే ఉండాలని ఆదేశాలు
- అన్ లోడింగ్ కు సహకరించాలని సూచన



3

## హరిత నిధి ప్రాజెక్టులను పూర్తి చేయాలి



3

- అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశాలు
- పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబాటు
- హరిత నిధి సమావేశంలో మంత్రి స్పష్టం
- అటవీ సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
- కొత్త ప్రాజెక్టులకు రాష్ట్ర స్థాయి కమిటీ ఆమోదం
- అర్బన్ పార్కులు, ఎకోటూరిజం అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్
- పలు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను సరళతరం చేయాలి

- ఎల్-1, ఎల్-2, ఎల్-3 లిస్ట్ లను మాడిఫై చేయాలి
- ఒకే ఇంట్లో 2, 3 కుటుంబాలు ఉన్న వారికి రెండో విడతలో అవకాశం కల్పించాలి
- ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ ఫైనల్ బిల్ రావడం లేదు
- త్వరితగతిన ఫైనల్ బిల్ చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలి
- ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి
- దేవునూరు గుట్టల చుట్టూ ఉన్న పట్టా రైతుల సమస్యలను పరిష్కరించాలి
- ధాన్యం కొనుగోళ్లు, రవాణాలో జాప్యాన్ని నివారించాలి
- సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి




హైదరాబాద్ లోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మరియు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలను సరళతరం చేయాలని తెలిపారు. ఒక లబ్ధిదారునికి సాంక్షన్ ప్రొసీడింగ్ ఇవ్వడానికి 4సార్లు సర్వే చేస్తున్నారని అన్నారు. గతంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక కోసం ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 లిస్ట్ రూపొందించామని కానీ ఈ కేటగిరిలలో చాలా లోపాలు ఉన్నాయని వెల్లడించారు. ఒక తండ్రికి ఇద్దురు, ముగ్గురు కుమారులు ఉండి ఒకే ఇంట్లో ఉంటున్న కుటుంబాలకు రెండో విడ తలో అవకాశం కల్పించే విధంగా నిబంధనలలో మార్పులు చేయా లని సూచించారు. అలాగే చాలా మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మా ణం పూర్తి అయి గృహ ప్రవేశం చేసినప్పటికి ఫైనల్ బిల్ రావడం లే దని తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే ఫైనల్ చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. —వరంగల్ బ్యూరో, ప్రభాతగమనం

# 26న 'నైరుతి' రాక..

- కేరళను తాకనున్న రుతుపవనాలు
- ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు చల్లని కబురు
- మే 22 నుంచి 30 మధ్య రుతుపవనాల ప్రవేశం?
- వాతావరణ పరిస్థితులపై ఐఎండీ స్పష్టీకరణ
- ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం

హైదరాబాద్ (ప్రభాత గమనం):

దేశవ్యాప్తంగా ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు అందించింది. నైరుతి రుతుపవనాలు ఈ నెల 26న కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని ఐఎండీ ప్రకటించింది. అయితే వాతావరణ పరిస్థితులను బట్టి ఈ ప్రక్రియ నాలుగు రోజుల ముందుగా లేదా ఆలస్యంగా జరిగే అవకాశం ఉందని తెలిపింది. అంటే మే 22 నుంచి మే 30 మధ్యలో రుతుపవనాలు కేరళలో ప్రవేశించే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1 నాటికి కేరళను చేరుకుంటాయి. అక్కడి నుంచి ఉత్తర దిశగా విస్తరిస్తూ దేశంలోని మిగిలిన ప్రాంతాలకు వ్యాపిస్తాయి. కేరళలో రుతుపవనాల ప్రవేశంతో దేశంలో అధికారికంగా వర్షాకాలం ప్రారంభమైనట్లు భావిస్తారు. రుతుపవనాల రాకపై స్పష్టత రావడంతో దేశవ్యాప్తంగా రైతులు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. గతేడాది మే 24న కేరళలో రుతుపవనాలు ప్రవేశించినట్లు ఐఎండీ గుర్తుచేసింది.



### ఎండల నుంచి ఉపశమనం

రాబోయే 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించేందుకు అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రుతుపవనాలు ఉత్తర దిశగా విస్తరిస్తున్న కొద్దీ దేశంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభించే అవకాశముందని పేర్కొంది.

### సాధారణం కంటే తక్కువ వర్షపాతం

ఈ ఏడాది రుతుపవన కాలంలో దేశంలో సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని ఐఎండీ తెలిపింది. దీనికి ప్రధాన కారణంగా 'ఎల్ నినో' ప్రభావాన్ని పేర్కొంది. దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణ స్థాయిలో 92 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. 1971–2020 మధ్య కాలానికి సంబంధించి దేశ దీర్ఘకాలిక సగటు వర్షపాతం 87 సెంటీ మీటర్లు కాగా, సాధారణంగా రుతుపవన కాలంలో సుమారు 80 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవుతుందని తెలిపింది.

### వ్యవసాయానికి జీవనాడి

దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు నైరుతి రుతుపవనాలు జీవనాడిగా భావిస్తారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఈ నాలుగు నెలల కాలంలో దేశానికి లభించే వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతం అందుతుంది. వ్యవసాయం, జలాశయాలు, భూగర్భ జలాల పునరుద్ధరణకు ఈ వర్షాలు అత్యంత కీలకంగా మారుతాయి. దేశంలోని 50 శాతానికి పైగా సాగుభూమి ఇప్పటికీ వర్షాధారంగానే ఉండగా, ఆ భూముల నుంచే దాదాపు 40 శాతం వ్యవసాయ దిగుబడి వస్తోంది. దీంతో దేశ ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతుపవనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

# బ్యాటరీ దొంగల అరెస్ట్

- స్వర్గరథం వాహనాల బ్యాటరీలు చోరీ చేస్తున్న నిందితులు
- సంగెం పోలీసుల చాకచక్యంతో పట్టివేత
- వరుస చోరీలకు చెక్ పెట్టిన పోలీసులు
- ఆరు బ్యాటరీలు, స్కూటీ స్వాధీనం
- నిఘా వేసి నిందితులను పట్టుకున్న ప్రత్యేక బృందం
- పలుచోట్ల బ్యాటరీలు దొంగిలించిన నిందితులు
- వరంగల్ లో అమ్మేందుకు తరలిస్తుండగా అరెస్ట్
- విచారణలో నేరాలు ఒప్పుకున్న ఇద్దరు
- వేగంగా కేసు ఛేదించిన సంగెం పోలీసులు
- పోలీసుల పనితీరుపై ప్రజల ప్రశంసలు
- సీఐ రాజగోపాల్ అభినందనలు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ జిల్లాలో గత వారం రోజులుగా వరుసగా జరుగుతున్న బ్యాటరీ దొంగతనాలకు సంగెం పోలీసులు చెక్ పెట్టారు. సంగెం, మామునూర్, పర్వతగిరి, వర్ధన్నపేట ప్రాంతాల్లో స్వర్గ రథాలకు సంబంధించిన బ్యాటరీలు మాయమవుతున్న ఘటనలు స్థానికంగా ఆందోళన కలిగించగా, పోలీసులు వేగంగా స్పందించి నిందితులను అరెస్ట్ చేశారు. మే 9, 10 తేదీల్లో గవిచర్ల, రామచంద్రపురం, తిమ్మాపూర్ గ్రామాల్లో చోటుచేసుకున్న స్వర్గ రథం బ్యాటరీ దొంగతనాలపై కేసులు నమోదు చేసిన సంగెం పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ ఆదేశాల మేరకు సంగెం ఎస్సై వంశీకృష్ణ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. హెడ్ కానిస్టేబుళ్లు సంతోష్, బాబు, కానిస్టేబుళ్లు శ్రవణ్, నవీన్ కిషోర్, వీరన్నలతో కలిసి ప్రత్యేక నిఘా కొనసాగించారు. నమ్మదగిన సమాచారం ఆధారంగా తిమ్మాపూర్ సబ్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు అనుమానితులు స్కూటీపై 6 బ్యాటరీలను తరలిస్తూ కనిపించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల విచారణలో గూడూరు అరవింద్, హింగిరి బన్నీ అలియాస్ తీగరాజుపల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. మే 9, 10 తేదీల్లో మమ్నూర్, పర్వతగిరి, ఉప్పరపల్లి, గావిచర్ల, రామచంద్రపురం, తిమ్మాపూర్ ప్రాంతాల్లో స్వర్గ రథాలకు అమర్చిన బ్యాటరీలను దొంగిలించినట్లు వారు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. దొంగిలించిన బ్యాటరీలను వరంగల్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్న సమయంలోనే వారిని పట్టుకున్నట్లు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి 6 బ్యాటరీలతో పాటు దొంగతనాలకు ఉపయోగించిన స్కూటీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వరుస దొంగతనాల కేసులను వేగంగా ఛేదించిన సంగెం పోలీస్ సిబ్బందిని పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ అభినందించారు. స్థానిక ప్రజలు కూడా పోలీసులు వేగంగా స్పందించి నిందితులను పట్టుకోవడంపై ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.



# అమర స్థూపం నిర్మాణ యత్నం భగ్నం..

- ఏడుగురిని బైండోవర్ చేసిన పోలీసులు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

హసన్‌పర్తి మండలం చింతగట్టు గ్రామంలో మావోయిస్టు పేరుతో అమర స్థూపం నిర్మించే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకుని ఏడుగురిని బైండోవర్ చేశారు. ఈ విషయాన్ని కేయూసీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవి కుమార్ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, 2025 మే 21న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు బూర రాకేశ్‌కు సంబంధించిన కుటుంబ సభ్యులు గ్రామంలో అమర స్థూపం నిర్మించేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని నిర్మాణ పనులను నిలిపివేశారు. ఈ ఘటనలో బూర రంజిత్ కుమార్, బూర బాబు, బూర స్వరూప, బూర రేఖతో పాటు నిర్మాణ పనులు నిర్వహిస్తున్న తాపీ మేస్త్రీలు బామళ్లపల్లి రాజమల్లు, గోపనబోయిన మొగిలి, మేకల సురేష్‌లను అదుపులోకి తీసుకుని హసన్‌పర్తి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా చర్యలు చేపట్టారని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎస్. రవి కుమార్ పేర్కొన్నారు.






# మడికొండలో విజిబుల్ పోలీసింగ్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ సూచనల మేరకు మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. మడికొండ సెంటర్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా మహిళలకు ప్రస్తుతం జరుగుతున్న చైన్ స్నాచింగ్ ఘటనలపై అవగాహన కల్పించారు. రోడ్డుపై వేగంగా బైక్‌లపై సంచరించే అనుమానాస్పద వ్యక్తులను గమనించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి, ఎలాంటి నేర కార్యకలాపాల్లో పాల్గొనరాదని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అత్యవసర సహాయ నంబర్ 100కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజ్ కుమార్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సీపీ సన్ ప్రీత్ సింగ్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ఆత్మకూర్ మండలం నీరుకుళ్ళ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను సీపీ రైతులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ధాన్యం తరలింపునకు అవసరమైన లారీలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్ లారీల సమస్యను జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. పోలీస్ కమిషనర్ వెంట ఆత్మకూర్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, ధాన్యం కొనుగోలు కేంద్రం అధికారులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, అదనపు డీసీపీ (ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్) రాయల ప్రభాకర్ రావు సూచనలతో, ఏసీపీ ట్రాఫిక్ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 28 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిలో ముగ్గురు మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించిన పోలీసులు వారిని గౌరవ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజశేఖర్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం రాచమల్ల చిన్నా (తండ్రి చంద్రయ్య), ముద్దమల్ల శ్యాంబాబు (తండ్రి సమ్మయ్య), బండారి ఆనంద్ (తండ్రి డేవిడ్)లకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనంతరం వారిని హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. ఈ వివరాలను కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ పి. వెంకన్న తెలిపారు.





# కేఎంసీ నర్సింగ్ కాలేజీలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్‌లోని కేఎంసి నర్సింగ్ కాలేజీ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు మరియు వాటి ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.సుజాత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించడం తప్పనిసరి అని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, లైసెన్స్ లేని వారు మరియు మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. ప్రతి వాహనానికి సరైన నెంబర్ ప్లేట్లు ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. అలాగే విద్యార్థినులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి ఘటనలను ఉపేక్షించకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీ టీమ్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్, సిబ్బంది సభ్యులు పాల్గొనగా సుమారు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు.



# ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

పోలీస్ చెక్ పోస్టుల్లో సిబ్బంది తప్పని సరిగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి వుంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. గోవులతో పాటు మూగ జీవాల అక్రమ రవాణా నియంత్రణ చేసేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సరిహద్దుల్లో ప్రత్యేకంగా పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చెక్ పోస్టుల్లో సిబ్బంది పనితీరును పరిశీలించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠాత్మకూర్ పోలీస్ చెక్‌పోస్ట్‌ను అకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీ భాగంగా ముందుగా పోలీస్ కమిషనర్ చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించడంతో పాటు, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపి ఈ చెక్‌పోస్ట్‌లో రికార్డుల నిర్వహణ, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకోని చెక్‌పోస్ట్‌లో సిబ్బంది కోసం ఎయిర్‌కూలర్, మంచినీటి ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ చెక్‌పోస్ట్ సిబ్బంది పలు సూచనలు చేస్తూ పోలీస్ సిబ్బంది నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. చెక్‌పోస్ట్ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. సీపీ వెంట ఆత్మకూర్ ఇన్ స్పెక్టర్ సంతోష్ ఉన్నారు.



# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్
- మామునూర్ పీఎస్ లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మామూనూర్ డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం మామూనూర్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు, నేరప్రవర్తన కలిగిన వ్యక్తులు చట్టబద్ధంగా ప్రవర్తించాలని సూచించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, గొడవలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. మద్యం, జూదం, అక్రమ వసూళ్లు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తమ పరిసరాల్లో ఎటువంటి నేర సంఘటన జరిగినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకుని చట్టానికి లోబడి జీవిస్తే సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవచ్చని, లేకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని డీసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మామూనూర్ ఏసీపీ వెంకటేష్, మామూనూర్, గీసుగొండ, ఏనుమాముల ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ యాదవ్, విశ్వేశ్వర్, సురేష్, సంగెం ఎస్ఐ వంశీకృష్ణ పాల్గొన్నారు.



# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్
- గీసుగొండ ఠాణాలో రౌడీషీటర్లకు డీసీపీ కౌన్సెలింగ్

**వరంగల్ బ్యూరో, మే 15 (ప్రభాత గమనం) :**

సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉంటూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయకుండా చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా జీవించాలని రౌడీషీటర్లకు సూచించారు.ఈ సందర్భంగా గొడవలు, బెదిరింపులు,దౌర్జన్యా లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.మద్యం,జూదం, అక్రమ వసూళ్లు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనరాదని తెలిపారు.గ్రామాల్లో ఏదైనా నేరం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, మహిళలు మరియు చిన్నపిల్లలతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. తమపై నమోదైన కేసుల విషయంలో కోర్టుకు తప్పనిసరిగా హాజరు కావాలని, భూవివాదాలలో జోక్యం చేసుకుని బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గీసుగొండ, మామునూరు,ఎనమాముల, ఐనవోలు,పర్వతగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలోని మొత్తం 33 మంది రౌడీషీటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మామునూరు ఏసిపి వెంకటేష్, గీసుగొండ ఇన్స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎనమాముల ఇన్స్పెక్టర్ సురేష్,మామునూరు ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఎస్ఐలు వంశీకృష్ణ, కుమార్,తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

# హరిత నిధి ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయాలి

- అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశాలు
- పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబాటు
- హరిత నిధి సమావేశంలో మంత్రి స్పష్టం
- అటవీ సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
- కొత్త ప్రాజెక్టులకు రాష్ట్ర స్థాయి కమిటీ ఆమోదం
- అర్బన్ పార్కులు, ఎకోటూరిజం అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్
- పలు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం



**వరంగల్ బ్యూరో, మే 15 (ప్రభాత గమనం) :**

హరిత నిధి 7వ రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అటవీ,పర్యావరణ మరియు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా గతంలో మంజూరైన ప్రాజెక్టుల అమలు పురోగతిని మంత్రి సమీక్షించగా,పలు కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు.నర్సరీల ఏర్పాటు,అర్బన్ పార్కుల అభివృద్ధి,అటవీ సంరక్షణ,అటవీ పరిశోధనలు,శిక్షణా కార్యక్రమాలు,ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు,ఎకోటూరిజం అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం లభించింది.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖగారు మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు హరిత నిధి కీలక వేదికగా పనిచేస్తోందన్నారు. అడవుల సంరక్షణతో పాటు పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ప్రాజెక్టు సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం కొనసాగుతున్న పనులతో పాటు కొత్తగా మంజూరైన ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే విధంగా ప్రాజెక్టులను రూపకల్పన చేసి, పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు.అటవీ సంపదను కాపాడడం, జీవ వైవిధ్య పరిరక్షణ, ఎకోటూరిజం అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి హరిత నిధి లక్ష్యాలను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# విపత్తు నిర్వహణలో మాక్ డ్రిల్స్ స్పందన కీలకం

- రాష్ట్ర రెవెన్యూ విపత్తు నిర్వహణ కార్యదర్శి దాసరి హరిచందన

**హన్మకొండ, ప్రభాత గమనం:**



వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు మరియు అటవీ అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంలో మాక్ డ్రిల్స్ కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర రెవెన్యూ విపత్తు నిర్వహణ కార్యదర్శి దాసరి హరిచందన అన్నారు. టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్‌కు సంబం ధించి పలు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు మరియు జిల్లాల యంత్రాంగంతో శుక్రవారం హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రిటైర్డ్ మేజర్ జనరల్ సుధీర్ బాహల్, రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ లతో కలిసి రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్మెంట్ సెక్రటరీ దాసరి హరిచందన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే 18న వివిధ జిల్లాల్లో రాష్ట్ర స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌లు జరగనున్నాయి తెలిపారు. 2025 డిసెంబర్ లో నిర్వహించిన మాక్ డ్రిల్స్ విపత్తు పరిస్థితుల్లో వివిధ శాఖల నుండి త్వరిత స్పందన మరియు సమన్వయ సేవలను నిర్ధారించడంలో ఎంతో ఉపయోగపడ్డాయని కార్యదర్శి అన్నారు. ఇటువంటి మాక్ డ్రిల్స్ క్షేత్ర స్థాయిలో లోపాలను గుర్తించడంలో సహాయపడతాయని మరియు శాఖలు క్రమబద్ధమైన పద్ధతిలో ప్రణాళిక మరియు సంసిద్ధతను మెరుగుపరచుకోవడానికి అవకాశం కల్పిస్తాయని అన్నారు. తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ శ్రీ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ మే 18న జరిగే వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు మరియు అటవీ అగ్ని ప్రమాదాలపై మాక్ ఎక్సర్‌సైజ్‌లలో దాదాపు 60 శాఖలు మరియు కేంద్ర ఏజెన్సీలు పాల్గొంటాయని చెప్పారు. న్యూఢిల్లీ నుండి వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్న NDMA లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బాహల్ (రిటైర్డ్ మేజర్ జనరల్), వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు మరియు అటవీ అగ్ని పరిస్థితుల సమయంలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల పాత్రలు మరియు బాధ్యతలపై వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు. 18న జరిగే రాష్ట్ర స్థాయి మాక్ డ్రిల్స్ ఏర్పాట్లకు సంబంధించి ఆయన అనేక సూచనలు కూడా చేశారు.

# పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీలో ఎంపీ కడియం కావ్య

- తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం
- హర్షం వ్యక్తం చేసిన జిల్లా ప్రజానీకం

**వరంగల్ బ్యూరో, మే 15 (ప్రభాతగమనం) :**



దేశవ్యాప్తంగా మహిళల హక్కులు,సంక్షేమం,సాధికారతకు సంబంధించిన అంశాలపై కీలక సూచనలు చేసే పార్లమెంటరీ మహిళా సాధికారత స్థాయి కమిటీలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా.కడియం కావ్య సభ్యురాలిగా నియమితులయ్యారు.లోక్‌సభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్ఠాత్మక కమిటీకి సీనియర్ పార్లమెంటేరియన్ పురందేశ్వరి అధ్యక్షత వహించనున్నారు.లోక్‌సభ,రాజ్యసభలకు చెందిన మహిళా ఎంపీలు కమిటీలో సభ్యులుగా కొనసాగనున్నారు.మహిళల భద్రత,విద్య,ఆర్థిక స్వావలంబన,ఉద్యోగావకాశాలు,లింగ సమానత్వం,సామాజిక రక్షణ తదితర అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి సూచనలు చేయనుంది.మహిళా సాధికారత కోసం అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రభావాన్ని సమీక్షించడంతో పాటు మహిళల ప్రాతినిధ్యం పెంపు,విధానాల సమర్థ అమలు,మహిళా హక్కుల పరిరక్షణకు అవసరమైన చర్యలపై కమిటీ ప్రత్యేక దృష్టి సారించనుంది.వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా.కడియం కావ్య కి ఈ కీలక కమిటీలో చోటు దక్కడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం.మహిళా సమస్యలపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య కి ఉన్న అవగాహన,సామాజిక అంశాలపై చూపుతున్న చొరవ దృష్ట్యా కమిటీలో ఎంపీ డా.కడియం కావ్య సేవలు కీలకంగా ఉండనున్నాయి.ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ...మహిళల సాధికారత,భద్రత,ఆర్థిక పురోగతికి సంబంధించిన అంశాలను కమిటీలో బలంగా ప్రస్తావిస్తానన్నారు.మహిళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.తెలంగాణ,ముఖ్యంగా వరంగల్ ప్రాంత మహిళల సమస్యలు,అవసరాలను జాతీయ స్థాయిలో ప్రస్తావించే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు.మహిళలకు సమాన అవకాశాలు కల్పించే దిశగా తన వంతు కృషి కొనసాగుతుందని ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు.



# మా ఉనికిని కాపాడండి!

- నాయకపోడు కుల గణనలో తప్పుల తడక..
- కలెక్టర్ కు ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం వినతి

**డోర్నకల్, మే 15 (ప్రభాత గమనం) :**

తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీ నాయకపోడు తెగ జనాభా గణాంకాల్లో ప్రభుత్వం తీవ్రమైన పొరపాట్లు చేస్తోందని, ఇది తమ జాతి ఉనికికే ప్రమాదకరమని ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. శుక్రవారం నాడు మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు డోర్నకల్ తహసీల్దార్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.సంఘం నాయకులు లేఖలో పేర్కొన్న ముఖ్య అంశాలు ,రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల 50 వేలకు పైగా ఉన్న నాయకపోడు జనాభాను, కేవలం 16,000 మందిగా పత్రికల్లో చూపడంపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.1949లో షెడ్యూల్డ్ తెగ జాబితాలో నాయకపోడులకు ప్రత్యేకంగా సీరియల్ నంబర్ 7 ఉండేదని, అయితే 1950లో 'ఆంధ్' తెగను చేర్చిన తర్వాత తమను 'గోండు' ఉపకులంగా మారుస్తూ సీరియల్ నంబర్ 6లో చేర్చడం వల్ల తమ ప్రత్యేక గుర్తింపు దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఒక్క ములుగు నియోజకవర్గంలోనే 4,500 మంది ఉన్నారని, మహబూబాబాద్ జిల్లాలోని 6 మండలాల్లోనే దాదాపు 4,600 కుటుంబాలు ఉన్నాయని వారు గుర్తు చేశారు.రాబోయే కేంద్ర ప్రభుత్వ కుల గణన మరియు జన గణనలో నాయకపోడు తెగకు ప్రత్యేక కాలమ్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. తద్వారా తమ జాతి సంస్కృతి, సంప్రదాయాలు కాపాడటమే కాకుండా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉద్యోగ, పారిశ్రామిక అవకాశాలు తమ తెగకు సక్రమంగా అందుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు పులి శ్రీను, ప్రధాన కార్యదర్శి దబ్బ శ్రీను పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపులో జాప్యం చేయొద్దు

- మిల్లర్లకు అధికారుల స్పష్టమైన ఆదేశాలు
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- రైస్ మిల్లర్లతో తహసీల్దార్ల సమావేశం
- నాణ్యత లోపాలపై కఠిన చర్యలు
- ధాన్యం తరలింపుపై జిల్లా యంత్రాంగం ఫోకస్
- డ్రైవర్లు మిల్లు వద్దే ఉండాలని ఆదేశాలు
- అన్‌లోడింగ్ కు సహకరించాలని సూచన




**మహబూబాబాద్ మే15(ప్రభాత గమనం):**

ప్రభుత్వ సూచనల మేరకు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు మక్కజొన్న 25 కేంద్రాలకు ప్రత్యేక అధికారులు, వరి ధాన్యం కొనుగోలు తరలింపు అంశాలపై క్షేత్రస్థాయిలో 18 మండలాలకు తహసీల్దారులను నియమించడం జరిగింది.గత రెండు మూడు రోజుల నుండి ధాన్యాన్ని తరలింపులో కలెక్టర్,అధికారులందరూ నిమగ్నమై గోదాం, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుంది. కొన్నిచోట్ల రైస్ మిల్లర్లు పోలీస్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకొని ముందుకు సాగుతున్నారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసుకొని ధాన్యాన్ని మక్కలను తరలిస్తున్నారు. శుక్రవారం ఉదయం కేసముద్రం మండల పరిధిలో గల అన్ని రైస్ మిల్లర్లతో సమావేశం తహసీల్దార్ గుండు వివేక్ సమక్షంలో నిర్వహించబడినది. ఈ సమావేశానికి స్థానిక సీఐ సత్యనారాయణ, ఎస్ఐ కె. క్రాంతి కిరణ్, మండల అధికారులు అందరు జిపివోలతో జరిగింది. ఈ సమావేశంలో రైస్ మిల్లర్లకు క్రింది విధంగా సూచనలు ఇవ్వబడినవి. రైస్ మిల్లుకు ధాన్యంతో వచ్చిన లారీలు/వాహనాలను ఎటువంటి ఆలస్యం లేకుండా ఏరోజు వచ్చిన వాహనాలను అదే రోజు అన్‌లోడ్ చేయవలెను.అన్‌లోడింగ్ పూర్తైన అనంతరం సంబంధిత లారీ యొక్క అక్నాలెడ్జ్‌మెంట్‌ను వారి ఆన్‌లైన్ ఓపిఎంఎస్ పోర్టల్‌లో వెంటనే కన్ఫర్మ్ చేయవలెను. ధాన్యంలో ఏవైనా డిఫెక్టులు గమనించిన యెడల, ఉదాహరణకు షార్ట్ ఫాల్, రాంగ్ వెరైటీ ఎంట్రీ అనగా సన్న ధాన్యం ఆన్లైన్ లో ఎంటర్ చేసి ఆ తర్వాత దొడ్డు ధాన్యం పంపడం, తేమ శాతం తక్కువగా ఉండుట లేదా ఇతర నాణ్యత సంబంధిత లోపాలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత ప్యాక్ సిఈవో, సెంటరింగ్ ఇన్‌చార్జ్,తహసీల్దార్ దృష్టికి తీసుకురావలెను. సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకుండా అనగా తేమశాతం చెక్ చేయకుండా వాహనాన్ని లోడింగ్ చేసి మిల్లుకు పంపిన తర్వాత, మిల్లు వద్ద క్వాలిటీ చెక్ చేశాక అక్కడ ధాన్యం తిరస్కరించబడినచో అట్టి సెంటర్ ఇన్చార్జి పైన కఠిన చర్యలు తీసుకొనబడును.రైతులతో ధాన్యం డిఫెక్టివ్‌గా ఉన్నదని చర్చించరాదు. సంబంధిత విషయమై కేవలం సిఈవో లేదా సెంటరింగ్ ఇన్‌చార్జ్ తో మాత్రమే మాట్లాడవలెను. ప్రక్రియ వేగవంతంగా మరియు సక్రమంగా జరిగే విధంగా, ఎక్కువ హమాలీ వర్కర్లను వెంటనే ఏర్పాటు చేసుకోవలెను. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు మరియు రవాణా ప్రక్రియ ఎటువంటి ఆలస్యం లేకుండా సజావుగా జరిగే విధంగా సంబంధిత అధికారులకు పూర్తిగా సహకరించవలెను. వాహనాల డ్రైవర్లు అన్‌లోడింగ్ కొరకు మిల్లు కు వచ్చిన పిదప, వారు అందుబాటులో ఉండకుండా వాహనాన్ని అక్కడే పెట్టి వెళ్తున్నారని తెలిసింది, వాహనాల డ్రైవర్లు మిల్లు వద్ద అక్కడే ఉండి అన్లోడింగ్ సమయంలో వారికి సహకరించగలరు, అన్లోడ్ సమయంలో లేకపోవడం వలన మిగిలిన వాహనాలకు అంతరాయం కలిగి అన్లోడింగ్ ఇబ్బందిగా మారుతున్నది.




# చిన్న బంజారలో ఉచిత వైద్య శిబిరం

- ప్రజల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యత : సర్పంచ్ బానోత్ మోతిలాల్

**గార్ల, మే 15 (ప్రభాత గమనం) :**

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే సత్సంకల్పంతో గార్ల మండలం చిన్న బంజార గ్రామ పంచాయతీలో భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ బానోత్ మోతిలాల్ ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.జంగాల రాజేశ్వర రావు 'సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్', మరియు 'సాయి రామ్ హాస్పిటల్స్' సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో సర్పంచ్ ఈ సంస్థలను సంప్రదించి, గ్రామంలోనే శిబిరం ఏర్పాటు అయ్యేలా కృషి చేశారు.శిబిరానికి విచ్చేసిన గ్రామ ప్రజలకు వైద్యులు పలు రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు:వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు.కంటి చూపు సమస్యలున్న వారికి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు.రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు."గ్రామంలోని అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే మా లక్ష్యం. ఆర్థిక స్తోమత లేక వైద్యానికి దూరమవ్వకూడదనే ఉద్దేశంతో ఈ ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేశాం. గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం సంతోషంగా ఉంది."ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బానోత్ హతీరామ్, ఉప సర్పంచ్ కేలోత్ భద్ర, వార్డు సభ్యులు నరేష్, బుజ్జి, రోజా పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు పంచిరం, హీరోలాల్, సురేష్, భీచ్యా, తరుణ్, హరి, జగియా, రాందాస్ మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను సరళతరం చేయాలి

- ఎల్-1, ఎల్-2, ఎల్-3 లిస్ట్ లను మాడిఫై చేయాలి
- ఒకే ఇంట్లో 2, 3 కుటుంబాలు ఉన్న వారికి రెండో విడతలో అవకాశం కల్పించాలి
- ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ ఫైనల్ బిల్ రావడం లేదు
- త్వరితగతిన ఫైనల్ బిల్ చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలి
- ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి
- దేవునూరు గుట్టల చుట్టూ ఉన్న పట్టా రైతుల సమస్యలను పరిష్కరించాలి
- ధాన్యం కొనుగోళ్లు, రవాణాలో జాప్యాన్ని నివారించాలి
- సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**వరంగల్ బ్యూరో, మే 15 (ప్రభాతగమనం) :**

హైదరాబాద్ లోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మరియు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలను సరళతరం చేయాలని తెలిపారు. ఒక లబ్ధిదారునికి సాంక్షన్ ప్రొసీడింగ్ ఇవ్వడానికి 4సార్లు సర్వే చేస్తున్నారని అన్నారు. గతంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక కోసం ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 లిస్ట్ రూపొందించామని కానీ ఈ కేటగిరిలలో చాలా లోపాలు ఉన్నాయని వెల్లడించారు. ఒక తండ్రికి ఇద్దరు, ముగ్గురు కుమారులు ఉండి ఒకే ఇంట్లో ఉంటున్న కుటుంబాలకు రెండో విడతలో అవకాశం కల్పించే విధంగా నిబంధనలలో మార్పులు చేయాలని సూచించారు. అలాగే చాలా మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం పూర్తి అయి గృహ ప్రవేశం చేసినప్పటికి ఫైనల్ బిల్ రావడం లేదని తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే ఫైనల్ చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

**ఇళ్ల స్థలాల పంపిణీకి అసైన్ మెంట్ కమిటీ ఏర్పాటు**

ఇంటి స్థలం లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల పంపిణి చేసేందుకు అసైన్ మెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. చాలా గ్రామాలలో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికి అసైన్ మెంట్ కమిటీ లేకపోవడం వల్ల ఇళ్ల స్థలాల పంపిణి చేయలేక పోతున్నామని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కు ఇళ్ల స్థలాలు పంపిణి చేసే విధంగా ఎమ్మెల్యేలు లేదా కలెక్టర్ చైర్మన్ గా అసైన్ మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. ఒక్క స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోనే 40నుండి 50గ్రామాలలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయని ఒక్కో గ్రామంలో 3నుండి 4ఎకరాల స్థలం ఉందని వీటిలో ఇళ్ల పట్టాలు పంపిణి చేసి ఇందిరమ్మ కాలనీలు నిర్మాణం చేసే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**నూతన గ్రామ పంచాయతీల్లో రేషన్, పెన్షన్ పంపిణీ చేయాలి**

రాష్ట్రంలో అనేక నూతన గ్రామ పంచాయతీలు ఏర్పడినప్పటికి ఇప్పటికి కూడా పాత గ్రామ పంచాయతీలలో రేషన్, పెన్షన్ ఇస్తున్నారని దింతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొత్త గ్రామ పంచాయితీలలో నూతన రేషన్ షాప్ లు ఏర్పాటు చేయాలని లేకపోతె కొత్త గ్రామ పంచాయితీలలోనే రేషన్ ఇచ్చే విధంగా ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు. అలాగే పెన్షన్ కోసం వృద్ధులు, వికలాంగులు పడుతున్న ఇబ్బందులును గుర్తించి కొత్త గ్రామ పంచాయితీలలో పెన్షన్లు ఇచ్చే విధంగా కూడా ఆదేశాలు ఇవ్వాలని అన్నారు.

**ఫారెస్ట్, పట్టా రైతుల భూ సమస్యల పరిష్కారం**

దేవునూరు గుట్టల చుట్టూ 4,5గ్రామాల పట్టా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు నోటిఫికేషన్ లో లేని పట్టా భూములను కూడా ఫారెస్ట్ భూమిగా పరిగనిస్తున్నారని దింతో పట్టా రైతులకు, ఫారెస్ట్ అధికారులకు మధ్య భూ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీనిపై వీలైనంత తొందరలో పట్టా రైతులు, ఫారెస్ట్ శాఖ భూ సమస్యపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

**ధాన్యం కొనుగోళ్లు, రవాణాను వేగవంతం చేయాలి**

మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో కంటాలో, రవాణాలో జాప్యం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ధాన్యం గోదాములకు తరలింపును వేగవతం చేయాలని అన్నారు. ఒక్కో కొనుగోలు కేంద్రంలో కంటా అయి 2వేల 3వేల బస్తాలు ఉన్నాయని రైతులు 10, 15రోజులు ఎదురుచూడాల్సి వస్తుందని తెలిపారు. కావున ధాన్యం రవాణా, కొనుగోళ్లను వేగవంతం చేసే విధంగా తక్షిణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

- కేంద్ర మంత్రి వర్గం నుంచి బండి సంజయ్ ను బర్తరఫ్ చేయాలి
- గార్లలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం

**గార్ల, మే 15 (ప్రభాత గమనం) :**

మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి కుమారుడు బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ గార్ల మండల కేంద్రంలో ప్రజాసంఘాలు సమరశంఖం పూరించాయి. శుక్రవారం పీవోడబ్ల్యూ, పీవైఎల్, పీడీఎస్ యూ, ఐఎఫ్టీయూ, ఏఐకేఎంఎస్ సంఘాల ఆధ్వర్యంలో బండి భగీరథ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూకే పద్మ, పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు ఎం. మహేష్ కుమార్, మాజీ పీవైఎల్ నాయకులు ఈ. సక్రు ప్రసంగించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదై వారం రోజులు గడుస్తున్నా, నిందితుడిని పోలీసులు ఎందుకు అరెస్టు చేయడం లేదని వారు ప్రశ్నించారు. "సామాన్యులు తప్పు చేస్తే గంటల్లో అరెస్టులు, ఎన్‌కౌంటర్లు చేసే యంత్రాంగం.. కేంద్ర మంత్రి కుమారుడి విషయంలో ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తోంది?" అని వారు నిలదీశారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ తన హోదాను అడ్డుపెట్టుకుని బాధితులను బెదిరిస్తున్నారని, కేసును మాఫీ చేసేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని నాయకులు తీవ్రంగా విమర్శించారు. నేరస్తుడిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న బండి సంజయ్‌ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. నిరసనకారులను నిర్బంధించి గొంతు నొక్కడం ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానానికి నిదర్శనమని ధ్వజమెత్తారు.చట్టం ముందు అందరూ సమానులేనని, నిందితుడు బండి భగీరథ్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ప్రజా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు మంగ్యా, గౌని మల్లేశం, శ్రీరాములు, కృష్ణయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..

- డోర్నకల్, గార్ల స్టేషన్లలో ఏడీఆర్ఎం సంజీవ్ కుమార్ పర్యటన

**గార్ల, మే 15 (ప్రభాత గమనం) :**

సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ ఏడీఆర్ఎం సంజీవ్ కుమార్ శుక్రవారం డోర్నకల్ రైల్వే జంక్షన్‌ను సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా విచ్చేసిన ఆయనకు డోర్నకల్, గార్ల రైల్వే స్టేషన్లకు సంబంధించిన పలు దీర్ఘకాలిక సమస్యలపై రైల్వే కమిటీ సభ్యులు మరియు సామాజిక కార్యకర్తలు వినతి పత్రాలు సమర్పించారు.గార్ల రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, స్టేషన్ ఆధునీకరణ పనులు చేపట్టాలని కోరారు.డోర్నకల్–బుద్ధారం సమీపంలో నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జి పనులు పూర్తయినందున, దానిని వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఖమ్మం నుండి మహబూబాబాద్ వెళ్లే ప్రయాణికులకు రైల్వే గేటు వద్ద వేచి ఉండే అవస్థలు తప్పుతాయని వివరించారు.బుద్ధారం రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు వెంటనే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలని పట్టుబట్టారు. "ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. ముఖ్యంగా బుద్ధారం బ్రిడ్జి అందుబాటులోకి వస్తే వేలమంది ప్రయాణికులకు సమయం ఆదా అవుతుంది."వినతులను స్వీకరించిన ఏడీఆర్ఎం సంజీవ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. బ్రిడ్జి ప్రారంభం మరియు అండర్ గ్రౌండ్ నిర్మాణాలపై సంబంధిత విభాగాల అధికారులతో అక్కడికక్కడే చర్చించారు. సాంకేతిక పరమైన అంశాలను పరిశీలించి, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రైల్వే డీఎస్ఓ సురేష్, డివిజనల్ అధికారులు, రైల్వే కమిటీ సభ్యులు లచ్చిరాం నాయక్, ఖాదర్ బాబా, సామాజిక కార్యకర్త ఈశ్వర్ లింగం, జాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం తరలింపును వేగవంతం చేయాలి

- మిల్లర్లకు అధికారుల స్ట్రాంగ్ వార్నింగ్
- క్షేత్రస్థాయిలో కలెక్టర్ ఆదేశాల అమలు
- కేసముద్రంలో మిల్లర్లతో కీలక సమావేశం

**కేసముద్రం,మే 15 (ప్రభాత గమనం):**

జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించిన నేపథ్యంలో యంత్రాంగం రంగంలోకి దిగింది. ధాన్యం కొనుగోలు, తరలింపు పర్యవేక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా 25 మొక్కజొన్న కేంద్రాలకు ప్రత్యేక అధికారులు, 18 మండలాలకు తహసీల్దార్లను ఇన్‌చార్జులుగా నియమించి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.ఈ క్రమంలో శుక్రవారం కేసముద్రం మండల పరిధిలోని రైస్ మిల్లర్లతో తహసీల్దార్ గుండు వివేక్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సీఐ సత్యనారాయణ, ఎస్ఐ క్రాంతి కిరణ్ మరియు జీపీఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మిల్లర్లకు మరియు సెంటర్ ఇన్‌చార్జులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు.మిల్లుకు చేరుకున్న ధాన్యం వాహనాలను ఏ రోజుకారోజు అన్‌లోడ్ చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను నిలిపి ఉంచకూడదు.అన్‌లోడింగ్ పూర్తయిన వెంటనే ఓపిఎంఎస్ పోర్టల్‌లో అక్నాలెడ్జ్‌మెంట్‌ను కన్ఫర్మ్ చేయాలి.ధాన్యంలో తరుగు , రకం మార్పిడి (సన్న రకం బదులు దొడ్డు రకం), తేమ శాతం వంటి తేడాలు ఉంటే వెంటనే సంబంధిత ప్యాక్స్ సీఈఓ లేదా తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ధాన్యంలో నాణ్యత లోపాలు ఉన్నాయని రైతులు లేదా డ్రైవర్లతో మిల్లర్లు నేరుగా వాదనలకు దిగకూడదని అధికారులు స్పష్టం చేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే కేవలం సెంటర్ ఇన్‌చార్జ్ లేదా సీఈఓల ద్వారానే పరిష్కరించుకోవాలన్నారు. అలాగే, సరైన నాణ్యత పరీక్షలు చేయకుండా మిల్లులకు ధాన్యం పంపి, అక్కడ తిరస్కరణకు గురైతే సదరు సెంటర్ ఇన్‌చార్జీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అన్‌లోడింగ్ సమయంలో లారీ డ్రైవర్లు వాహనాల వద్దే ఉండాలని, డ్రైవర్లు అందుబాటులో లేకపోవడం వల్ల ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని అధికారులు గుర్తించారు. హమాలీలను పెంచుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, కొనుగోలు చేసిన ప్రతి గింజను సురక్షితంగా గోదాములకు, మిల్లులకు చేరవేసేలా పోలీస్ మరియు రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

# పుస్తకం చదవండి.. జ్ఞానం పెంపొందించుకోండి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి

**మహబూబాబాద్, మే.15 (ప్రభాత గమనం):**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో శుక్రవారం ఐదవ రోజు మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ..పుస్తకం చదవండి జ్ఞానం పెంపొందించుకోండి సమాజాన్ని వెలిగించండి అని అన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని సంపాదించాలని మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా పుస్తకాలతో స్నేహం చేయాలని మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో , గ్రంథాలయ పాఠకులకు కావలసిన వసతులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని పాఠకులు తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు. సమాజ అభివృద్ధి కి విద్య ఎంతో ముఖ్యమని ప్రతి విద్యార్థి ఉన్నంత లక్ష్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, సీనియర్ పాఠకుడు టీవీ రామనర్సయ్య, డిఎస్ఓ అప్పారావు , ఏ సి జి, మందుల శ్రీరాములు, ఏ ఎస్ సి సంతోష్, ముక్క లక్ష్మణరావు, నరసింగ శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ గ్రంథపాలకులు, జి విజేందర్, సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్ ,భూలక్ష్మి , యాదమ్మ బాబా , పుస్తక ప్రియులు , పాఠకులు , విద్యార్థిని విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.




# మున్నేరు - పాలేరు లింక్ కెనాల్ వద్దు

- డిజిటల్ సర్వేలో తేల్చిచెప్పిన జనం
- సారవంతమైన భూములను ఎడారి చేయొద్దు
- ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలి: శీలంశెట్టి రమేష్

**గార్ల, మే 15 (ప్రభాత గమనం) :**

మున్నేరు – పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ ప్రతిపాదన స్థానిక రైతాంగం పాలిట శాపంగా మారుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు నిర్వహించిన డిజిటల్ సర్వే ఫలితాలు ఇప్పుడు సంచలనం రేపుతున్నాయి. అత్యధిక శాతం ప్రజలు, రైతులు ఈ ప్రాజెక్టును ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ స్పందిస్తూ.. ప్రజాకాంక్షను గౌరవించి ప్రభుత్వం వెంటనే లింక్ కెనాల్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.నిర్వహించిన ఈ డిజిటల్ సర్వేలో ప్రజలు ప్రధానంగా మూడు అంశాలపై తమ ఆందోళనను వ్యక్తం చేశారు.తరతరాలుగా సాగు చేసుకుంటున్న సారవంతమైన భూములు ఈ ప్రాజెక్టు వల్ల బీడు భూములుగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మున్నేరు నీటిని మళ్లించడం వల్ల ఆయకట్టు ఎండిపోవడం ఖాయమని సర్వేలో తేలింది.ప్రకృతి సిద్ధంగా ప్రవహించే మున్నేరు ప్రవాహాన్ని కృత్రిమంగా మళ్లించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తప్పదని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు.భూసేకరణ పేరుతో వందలాది ఎకరాలను సేకరించడం వల్ల రైతులు తమ సొంత భూముల్లోనే కూలీలుగా మారే దుస్థితి వస్తుందని, ఇది రైతుల ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్య అని సర్వేలో వెల్లడైంది."అభివృద్ధి అంటే వినాశనం కాదు, మనుషులను, మట్టిని కాపాడటం.



మున్నేరు మన జీవనాడి, దాన్ని తెంచనివ్వం. ఈ డిజిటల్ సర్వే ఫలితాలే ప్రభుత్వానికి కనువిప్పు కావాలి."ఈ సందర్భంగా శీలంశెట్టి రమేష్ మాట్లాడుతూ.. "మున్నేరు గడ్డపై ఆధారపడి బతుకుతున్న వేలాది రైతు కుటుంబాల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఏ నిర్ణయాన్నైనా ప్రజాస్వామ్యయుతంగా ఎదురిస్తాం. ఈ సర్వేలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మెజారిటీ ప్రజల గళాన్ని వినిపించేందుకే ఈ సర్వే చేపట్టాం. ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి, రైతుల ప్రయోజనాల దృష్ట్యా లింక్ కెనాల్‌ను రద్దు చేయాలి" అని స్పష్టం చేశారు. ప్రజల మద్దతుతో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, రైతుల పక్షాన నిలబడి వారి హక్కులను కాపాడుకుంటామని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374